క్లుప్తంగా

అడ్లూరికి జీవన్‌రెడ్డి పరామర్శ



అడ్లూరిని పరామర్శిస్తున్న జీవన్‌రెడ్డి

ధర్మపురి: ప్రజల దీవెనలతోనే పెద్ద ప్రమాదం తప్పిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఇటీవల ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొంది ధర్మపురికి చేరుకున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను శుక్రవారం జీవన్‌రెడ్డి పరామర్శించారు. జీవన్‌రెడ్డితో పాటు ధర్మపురి, బుగ్గారం జెడ్పీటీసీలు బత్తిని అరుణ, బాదినేని రాజేందర్, వివిధ మండలాల నాయకులు కార్యకర్తలు పరామర్శించారు.

జాయింట్ సర్వే కోసం భూమి పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్,డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్ గ్రామశివారులో అటవీశాఖ, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే జాయింట్ సర్వే కోసం ఆర్డీవో శ్రీనివాస్, డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. సర్వే నంబర్ 87లో నిమ్మలం మల్లేశ్, 1.2 ఎకరాలు, కమ్మరి వెలిచాల గంగారం 20 గుంటల భూమిని కొంత కాలంగా సాగు చేసుకుంటున్నారు. అటవీశాఖ అధికారులు అడ్డుకుని కందకం తవ్వడంతో హైకోర్టుకు వెళ్లారు. కోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ, అటవీశాఖ అధికారులు జాయింట్ సర్వే చేసేందుకు భూమి వద్దకు రికార్డులతో సహా వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ ప్రసాద్, ఎఫ్‌ఆర్‌వో సాకాత్ ఆలీ, ఎఫ్‌ఎస్‌వో చైతన్యశ్రీ, ఆర్‌ఐలు గంగాధర్, రమేశ్, ఫారెస్ట్ బీట్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి



రైతుకు చెక్కు అందిస్తున్న చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి: రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలను సకాలంలో చెల్లించాలని ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఆవరణలో శుక్రవారం ధర్మపురి, బుగ్గారం మండలాలకు చెందిన ఆరుగురు రైతులకు రూ.23 లక్షల విలువ చెక్కులను పంపిణీ చేశారు.కార్యక్రమంలో సభ్యులు ఎల్లాగౌడ్, నక్క రాజు, పెరుక రమేశ్, సీఈవో రాజేశ్ తదితరులున్నారు.

ప్రహరీ తొలగించాలని కమిషనర్‌కు వినతి

కోరుట్ల: పట్టణ శివారులోని ఊడుగుల పోచమ్మ వద్ద నిర్మించిన ప్రహరీని తొలగించాలని మాదిగ సంఘం అధ్యక్షుడు శనిగారపు రాజేశ్ శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌ను కోరాడు. పెళ్లిల్లు, శుభ కార్యాలకు పోచమ్మ భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని, ఈ సమయంలో అమ్మవారి చుట్టూ ప్రదక్షిణ చేస్తారన్నారు. ప్రహరీ నిర్మాణంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రహరీ తొలగింపజేయాలని కోరాడు.

ఎరువులు ఎమ్మార్పీకే విక్రయించాలి



పెగడపల్లి: ఎరువులు, విత్తనాల విక్రయాలు ప్రభుత్వ నిబంధనల మేరకే జరపాలని ధర్మపురి ఏడీఏ రాంచందర్ డీలర్లకు సూచించారు. పెగడపల్లి మండల కేంద్రంలోని పలు ఎరువులు, విత్తన దుకాణాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాల నాణ్యత, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. నిల్వలను స్టాక్ బోర్డులో నమోదు చేయాలని, ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించి, రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. ఈ-పాస్, బయోమెట్రిక్ పద్ధతిలో విక్రయాలు జరపాలని సూచించారు. ప్రభుత్వం నిషేధించిన క్రిమిసంహారక మందులు విక్రయించినా, నిబంధనలు ఉల్లఘించినా చర్యలు తీసుకుంటామని, దుకాణ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఈవో నవీద్ ఉన్నారు.

మహిళా సంఘాలకు సొంత భవనాలు కరువు

- సమావేశాలకు ఇబ్బంది పడుతున్న మహిళలు
- అద్దె భవనాల్లో కొనసాగుతున్న వైనం



రామబద్రునిపల్లిలో సమావేశమైన స్వశక్తి మహిళలు(ఫైల్)

పెగడపల్లి: జిల్లాలోని మహిళా సంఘాలకు సమావేశాలు నిర్వహించుకోవడానికి సొంత భవనాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల నిర్వహణ కొనసాగుతోంది. స్వశక్తి సంఘాల ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు కొన్ని మహిళా సంఘాలకు సొంత భవనాలు లేవు. ప్రతి నెలా గ్రామాల్లో సమావేశాల నిర్వహణకు సొంత భవనాలు లేక ఇక్కట్లు పడుతున్నామని వాపోతున్నారు. చేసేదేమి లేక చెట్ల కిందనో, సభ్యుల ఇళ్లలో సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మహిళా సంఘాలకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యతనిస్తున్నా, సొంత భవనాలు నిర్మాణాలపై దృష్టి సారించడం లేదు. జిల్లా వ్యాప్తంగా 20 మండలాల్లో 565 గ్రామైఖ్య సంఘాలుండగా, 14,500 వరకు స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో సుమారు 1,75,694 మంది సభ్యులున్నారు.

స్వయం ఉపాధి కార్యక్రమాలతో జీవనోపాధి అవకాశాలు పెంపొందించుకుంటూనే పొదుపులో స్వయం సహాయక సంఘాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. కాగా గ్రామ స్థాయిలో కార్యాలయాలు లేక మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల మంజూరు, వసూళ్లు, సభ్యుల్లో చైతన్యం పెంపొందించడంలో కీలకపాత్ర పోషించే గ్రామ సంఘాలకు సరైన వేదికలు అందుబాటులో లేక పోవడంతో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధిగమించని సమస్యలు

గ్రామీణ సంఘాల్లోని పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్వయం సహాయక సంఘాలకు సొంత భవనాలు లేక పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. సంఘాల కార్యకలాపాల నిర్వహణతో పాటు మహిళా సమాఖ్యలు, మహిళా పొదుపు సంఘాల సమావేశాల నిర్వహణ, శిక్షణ చేపట్టడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామాఖ్య సంఘాల వద్దకు వివిధ పనుల కోసం వచ్చిపోయే మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులకు గ్రామాల్లో మౌలిక వసతులు కొరవడటంతో అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల నిర్వహణకు మండల కేంద్రాల్లో ఇందిరా క్రాంతిపథం పేరిట సొంత భవనం ఏర్పాటు చేశారు. జిల్లాలో 37 గ్రామైఖ్య సంఘాలకు మాత్రమే సొంత భవనాలుండగా, 528 సంఘాలు అద్దె భవనాల్లో నెట్టుకొస్తున్నారు. 17 మండల గ్రామైఖ్యలకు గానూ 15 చోట్ల మాత్రమే మండల కార్యాలయాలున్నాయి. స్వయం సహాయక సంఘాల నిర్వహణ కోసం గ్రామాల్లో సంఘ భవనాలు నిర్మిస్తే మహిళలకు ఇబ్బందులు తీరుతాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మహిళా సంఘాలకు సొంత భవనాలు నిర్మించాలని సంఘాల సభ్యులు కోరుతున్నారు.

ప్రభుత్వ పరిధిలో ఉంది



జిల్లాలో కొత్తగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనాల్లో మహిళా సంఘాల సభ్యులు సమావేశాలు నిర్వహించుకునేలా గదులు నిర్మాణం జరుగుతున్నాయి. మిగిలిన స్వయం సహాయక సంఘాల నిర్వహణ కోసం సొంత భవనాల నిర్మాణాల విషయం ప్రభుత్వానికి నివేదించాం. కొన్ని గ్రామాల్లో భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం.

– సంపత్‌రావు డీఆర్డీవో

రూరల్ ఎంపీపీ ఎన్నికపై ఉత్కంఠ

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ ఎంపీపీ ఎన్నిక ఈనెల 28న నిర్వహించనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 11 మంది సభ్యులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఏకాభిప్రాయానికి తీసుకువచ్చారు. రెండు రోజుల క్రితం ధర్మపురి రోడ్‌లోని బీఆర్ఎస్ పార్టీ నాయకుని ఇంట్లో అర్బన్ మండలానికి చెందిన నాయకుడు, ఎమ్మెల్యే, ఎంపీటీసీ సభ్యులంతా సమావేశమయ్యారు. ఎంపీటీసీ సభ్యులందరూ ఎమ్మెల్యే ఎంపిక చేసిన అభ్యర్థికే తమ మద్దతు ఇస్తామని ఏకాభిప్రాయానికి వచ్చారు. కాగా బీఆర్ఎస్ నుంచి ఎంపీపీగా నర్సింగాపూర్ ఎంపీటీసీ మహేశ్, పోరండ్ల ఎంపీటీసీ ఆరె సౌజన్య ఆశిస్తున్నారు. దీంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు ద్వితీయశ్రేణి నాయకులు సౌజన్యకు ఎంపీపీ పదవీ ఇవ్వాలని ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు కూడా తాటిపల్లి ఎంపీటీసీ శ్రీనివాస్ మద్దతుతో తాము ఎంపీపీ పదవిని దక్కించుకోవాలని ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. అలాగే బీఆర్ఎస్‌లో ఇద్దరు పదవిని ఆశిస్తుండటంతో ఎమ్మెల్యే మద్దతు ఎవరికి ఉంటుందో వారికే ఎంపీపీ పదవీ దక్కనుంది.

మున్సిపల్ బడ్జెట్ సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సత్తమ్మ

ధర్మపురి: హరిత పట్టణంగా తీర్చిదిద్దడానికి పాలకవర్గం కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో శుక్రవారం 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై సమావేశం నిర్వహించారు. సమావేశంలో పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల ఏర్పాటుపై బడ్జెట్ కేటాయింపులను వివరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి మొత్తం 14 కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో కమిషనర్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ రామన్న, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మేనేజర్ గంగాధర్ పాల్గొన్నారు.

నేటి నుంచి ముత్యాల పోచమ్మ జాతర

బుగ్గారం: జిల్లాలోనే ప్రముఖమైనదిగా పేరుగాంచిన బుగ్గారం ముత్యాల పోచమ్మ ఆలయ జాతర ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో జిల్లాలోని అనేక మండలాలల నుంచే కాకుండా ఇతర జిల్లాల భక్తులు సైతం విచ్చేసి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా నేడు ఎడ్లబండ్ల పోటీలు, ఆదివారం రథోత్సవం నిర్వహించనున్నారు.ఆలయం చాలా చిన్నదిగా ఉండడంతో జాతర, ఇతర వేడుకల సమయాల్లో భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. దీని కోసం ఆలయాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

నేడు మూడు గ్రామాల్లో జాతర ఉత్సవాలు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాలలో శ్రీ వేంకటేశ్వరస్వామి, పోతారం, కలిగోట గ్రామాల్లో శ్రీలక్ష్మి నృసింహస్వామి జాతర ఉత్సవాలు శనివారం నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రతినిధులు తెలిపారు. జాతర ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సంగెంలో ఘనంగా మల్లికార్జునస్వామి ఊరేగింపు



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

మల్లాపూర్: మండలంలోని రత్నాపూర్ శ్రీ మల్లికార్జునస్వామి జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం సంగెం–శ్రీరాంపూర్‌లో స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. రత్నాపూర్ మల్లికార్జునస్వామికి సంగెం–శ్రీరాంపూర్ గ్రామస్తులు, మహిళలు డప్పు చప్పుళ్లు, మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాలేపు దిలీప్, ఎల్కా కమలాకర్, బెజ్జారపు సాయికుమార్, హిందూ వాహిని సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో ఎడ్లబండ్ల జాతర

పెగడపల్లి:మండలంలోని లింగాపూర్‌లో శ్రీలక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పంచామృత అభిషేకాలు, అన్నదానం, ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో చైర్మన్ మల్లయ్య, ఎంపీటీసీ శోభ, గ్రామస్తులు, నిర్వాహకులు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి యాగం, ద్వారతోరణవిధి, అఖండ దీప స్థాపన, ధ్వజరోహనం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొడిశెల గంగాధర్, ఆలయ చైర్మన్ తక్కూరి మల్లేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వామివారికి వసంతోత్సవం

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎనగంటి సామ్రాట్, ఆలయ అర్చకులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంగనాల ఆయకట్టుకు నీళ్లందించాలి

- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్



ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

ఇబ్రహీంపట్నం: గంగనాల ప్రాజెక్టు నుంచి మల్లాపూర్ మండలం మొగిలిపేటతో పాటు ఇతర గ్రామాల ఆయకట్టుకు నీళ్లందేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని మూలరాంపూర్ గ్రామ శివారులో నిర్మించిన సదర్‌మట్ బ్యారేజీ వద్ద గంగనాల ప్రాజెక్టుకు నీళ్లు వచ్చే ప్రదేశాన్ని పరిశీలించి మాట్లాడారు. సదర్‌మట్ బ్యారేజీ నుంచి ఒకే గేటు ద్వారా ఒక పాయలో నిర్మల్ జిల్లా ఖానాపూర్ వైపు ఎక్కువగా నీళ్లు వెళ్తున్నాయని, గంగనాల ప్రాజెక్టుకు తక్కువగా నీళ్లు రావడం వలన ప్రాజెక్టు కింద ఉన్న వేములకుర్తి, యామాపూర్, ఫకీర్‌కొండాపూర్ గ్రామాల వరకు ఆయకట్టుకు నీళ్లు అందుతున్నాయని, మల్లాపూర్ మండలం మొగిలిపేట, దామ్‌రాజ్‌పల్లి, కొత్తదామ్‌రాజ్‌పల్లి, సంగెం శ్రీరాంపూర్ గ్రామాలకు సాగునీరందే పరిస్థితి లేదని, వెంటనే ఇరిగేషన్ అధికారులు మల్లాపూర్ మండలానికి నీళ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎలాల దశరథ్‌రెడ్డి, నాయకులు జేడీ సుమన్, జగన్‌రావు,రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎక్సైజ్ సూపరింటెండెంట్



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న ఎక్సైజ్ సత్యనారాయణ

జగిత్యాల: జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నియమితులైన సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించి అనంతరం జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పరిస్థితిపై చర్చించారు.

పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ



స్టేషన్ పరిసరాలు పరిశీలిస్తున్న డీఎస్పీ

మేడిపల్లి: మండల పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్ రావు తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. ఆయన వెంట సీఐ ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్యే లాస్యనందిత మృతికి నివాళి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్

జగిత్యాల: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, బాలముకుందం, వొల్లం మల్లేశం,తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

జగిత్యాల: ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఉప్పరిపేటలో పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట నాయకులున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత బొమ్మెన జట్టు

కథలాపూర్: మండలంలోని బొమ్మెనలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో విజేతగా బొమ్మెన జట్టు నిలిచింది. 10 రోజులుగా నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో 28 జట్లు పాల్గొన్నాయి. శుక్రవారం జరిగిన ఫైనల్‌లో బొమ్మెన జట్టు వల్లంపెల్లి పై విజయం సాధించింది. విజేత జట్టుకు రూ. 12 వేలు నగదు, జ్ఞాపిక, రన్నరప్‌కు రూ. 6 వేలు నగదు, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పిడుగు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పిడుగు తిరుపతిరెడ్డి, చిందం సుధాకర్, నిర్వాహకులు పాల్గొన్నారు.

'బండి సంజయ్‌ను విమర్శించే స్థాయి రవిశంకర్‌కు లేదు'

మల్యాల: బండి సంజయ్‌ను విమర్శించేస్థాయి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌కు లేదని బీజేపీ మండల అధ్యక్షుడు నేరేళ్ల శ్రావణ్ అన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్రపై చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చేసిన విమర్శలపై ఒక ప్రకటనలో స్పందించారు. బీఆర్ఎస్ పాలనలో మీరు ఏం సాధించారో ముందుగా చెప్పాలని శ్రావణ్ డిమాండ్ చేశారు.రాబోయే ఎన్నికల్లో ఎవరు ఏం సాధించారో ప్రజలే తేలుస్తారన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

సారంగాపూర్: మండలంలోని పోతారంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు పరస్పర దాడికి పాల్పడడంతో ముగ్గురిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసారు. స్టేషన్‌హౌజ్ అధికారి రవీందర్‌రెడ్డి కథనం ప్రకారం.. పోతారం గ్రామానికి చెందిన ఎండీ. హుస్సేన్, బషీర్ ఇద్దరు అన్నదమ్ములు. వీరి తల్లితండ్రులు ఆస్తి పంపకాలు గతంలోనే పూర్తి చేశారు. బషీర్ తనకు వచ్చిన ఆస్తుల్లో మొత్తం ఆస్తి అమ్మి, 1.10 ఎకరంలో వ్యవసాయం చేసుకుంటూ జగిత్యాలలో నివాసం ఉంటున్నాడు. బషీర్ తన వ్యవసాయ భూమిలోకి శుక్రవారం రాగానే అన్న హుస్సేన్ నీకు భూమి లేదని తన కొడుకు అస్లాంతో కలిసి దాడి చేశాడు. బషీర్ వారిపై ఫిర్యాదు చేయగా, హుస్సేన్ ఆయన కొడుకుపై బషీర్ దాడి చేసినట్లు ఫిర్యాదు చేశాడు. ఇరువురు ఫిర్యాదు చేసుకోవడంతో హుస్సేన్, అస్లాం, బషీర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు

జగిత్యాలక్రైం: రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్సై సదాకర్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడలో అక్రమంగా నిలువ చేసిన 58 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం సీజ్ చేశారు. కల్లెడ గ్రామానికి చెందిన మంచాల అంజయ్య లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని తన ఇంట్లో నిల్వ చేశాడు. ఎస్సై సదాకర్, ఏఎస్సై శంకరయ్య అంజయ్య ఇంట్లో తనిఖీ చేసి, రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. అంజయ్యపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై పేర్కొన్నారు.

పట్టణ ఇన్‌చార్జి సీఐగా ఆరీఫ్ అలీఖాన్

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణ సీఐ నటేశ్‌గౌడ్‌ను శుక్రవారం పోలీసు ఉన్నతాధికారులు సస్పెండ్ చేయగా, పట్టణ ఇన్‌చార్జి సీఐగా రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్‌ను నియమించారు. ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఆరీఫ్‌అలీఖాన్ కొనసాగనున్నారు.

విద్యార్థుల వీడ్కోలు వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ధర్మపురి/కథలాపూర్: మండలంలోని మగ్గిడి ఆదర్శ పాఠశాల, కథలాపూర్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. కార్యక్రజమాల్లో ప్రిన్సిపాళ్లు బుచ్చన్న, నరేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పద్మశాలీల సమస్యలు పరిష్కరించాలని వినతి

రాయికల్: మండలంలోని భూపతిపూర్ పద్మశాలీ సంఘం సభ్యుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి సంఘ సమస్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, సంఘ అధ్యక్షుడు జక్కుల రవీందర్, యూత్ అధ్యక్షుడు జక్కుల సాగర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

రాయికల్: మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని దాసరి జలదీజ జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించింది. శుక్రవారం మెట్‌పల్లిలో సత్యసాయి ఆలయంలో హెచ్‌ఎం శ్రీమతి విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మక్క జాతర



వన దేవతలకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

పెగడపల్లి: మండల కేంద్రంలో సమ్మక్క–సారలమ్మ జాతర ఘనంగా ముగిసింది. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జనజాతర జోరుగా సాగింది. మండలంలో సమ్మక్క–సారలక్క జాతర ఉత్సవాలు లేక పోవడంతో వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కోయ పూజారులచే ప్రత్యేక పూజలు చేసి డప్పుచప్పుళ్లతో అమ్మవార్లను వనానికి తరలించారు.

'ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై విమర్శలు సరికాదు'

కోరుట్ల: ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి విమర్శించటం సరికాదని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి శేర్ నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో మాట్లాడుతూ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం పాటు పనిచేస్తూ మచ్చలేని నాయకుడిగా పేరున్న జీవన్ రెడ్డిని విమర్శించటం మానుకోవాలన్నారు. ఎంపీ అర్వింద్ సంచలనాల కోసమే రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అర్వింద్‌కు ఓటమి తప్పదన్నారు.

సంఘం భవనానికి నిధులు మంజూరు

కోరుట్ల: పట్టణంలోని పటేల్ రోడ్‌లో గల రజక సంఘ భవనానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ రూ. 4 లక్షలు ఎంపీ నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు ప్రొసీడింగ్ పత్రాలను బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఇందూరి తిరుమల వాసు సంఘ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నిమ్మల వెంకట నర్సయ్య, బొర్రగల్లి నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు ప్రభుత్వం చేయూతనివ్వాలి

మల్లాపూర్: గీత కార్మికులకు ప్రభుత్వం చేయూతనివ్వాలని సర్వాయి పాపన్నగౌడ్ గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రంగు రామాగౌడ్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్‌లో మాట్లాడారు. గీత కార్మికులకు తాటి, ఈత వనాలు పెంచుకోవడానికి ప్రతీ గ్రామంలో 5 ఎకరాలు కేటాయిస్తామన్న గత ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పడినందు గీత కార్మికుల జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని ఐదెకరాల భూమిని కేటాయించాలని సంఘం నాయకులు కోరారు. సమావేశంలో గీత కార్మికులు పాల్గొన్నారు.

రేషన్ షాపు కోసం ఎమ్మెల్యేకు వినతి

కథలాపూర్: మండలంలోని రాజారాం తండా గ్రామంలో రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు శుక్రవారం వేములవాడలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. కొత్తగా గ్రామ పంచాయతీ ఏర్పడినప్పటికీ రేషన్‌షాపు లేకపోవడంతో పక్క గ్రామానికి వెళ్లి రేషన్‌బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోందని విన్నవించారు. కాగా రాజారాం తండాలో కొత్తగా రేషన్‌షాపు, తుర్తి గ్రామంలో రేషన్ డీలర్‌ను నియమించాలని కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్‌కు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సిఫార్సు చేశారు.